సాక్షి ఒడిశా
గురువారం | 25 | జూలై | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,60,324లు, బంగారం 870 మిల్లీగ్రాములు, వెండి 1114గ్రాముల 900 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

డిప్యూటీ స్పీకర్‌గా భవానీ శంకర్



రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా తొలిసారా శాసన సభ్యుడు భవానీ శంకర్ భోయ్ ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నికయ్యారు.
- 8లో▸



మజ్జిగౌరి హుండీ ఆదాయం లెక్కింపు
ఉత్కలాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి మజ్జిగౌరి అమ్మవారికి భక్తులు సమర్పించే కానుకల హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు.
- 8లో▸

న్యూస్‌రీల్

ఉత్తర ఒడిశా అభివృద్ధి మండలి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

భువనేశ్వర్: ఉత్తర ఒడిశా అభివృద్ధి మండలి ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఈ టాస్క్‌ఫోర్స్‌కు గృహ నిర్మాణం మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కృష్ణ చంద్ర మహాపాత్రో అధ్యక్షత వహిస్తారు. ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో ఉత్తర ఒడిశా అభివృద్ధి మండలి ఏర్పాటు చేసే బాధ్యతను టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్‌లో ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్య వంశీ సూరజ్, ప్రభుత్వ డిప్యూటీ చీఫ్ విప్ గోవింద్ చంద్రదాస్, బాలాసోర్ పార్లమెంటు సభ్యులు ప్రతాప్ చంద్ర షడంగి, కెంజొహార్ ఎంపీ అనంత్ నాయక్, కరంజియా ఎమ్మెల్యే పద్మ చరణ్ హైబురు, చంపువా ఎమ్మెల్యే సనాతన్ మహాకుడు, తెల్కోయ్ ఎమ్మెల్యే ఫకీర్ మోహన్ నాయక్, బాసుదేవ్‌పూర్ ఎమ్మెల్యే అశోక్ కుమార్ దాస్ సభ్యులుగా ఉన్నారు.

అంబులెన్స్ సిబ్బంది పెద్ద మనసు



రోగిని బోటు అంబులెన్స్ వద్దకు తీసుకొస్తున్న దృశ్యం

కొరాపుట్: జిల్లాలోని లమ్తాపుట్ సమితి డబ్బుగుడ గ్రామ పంచాయతీ పాత్రోపుట్ గ్రామానికి చెందిన సను గుంత అనే యువకుడు మలేరియాతో బాధపడుతున్నాడు. జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో అస్పత్రిలో చేర్చాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. కొలాబ్ రిజర్వాయర్‌లో కటాప్ గ్రామాలకు అత్యవసర వైద్య సాయంలో తరలింపు కోసం ప్రభుత్వం గతంలో బోటు అంబులెన్స్ ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు 108కి సంప్రదించారు. దీంతో పడవ అంబులెన్స్ గ్రామ సమీపంలోని రిజర్వాయర్ ఒడ్డుకి వచ్చింది. కానీ బాధితుడిని పడవ వద్దకు తరలించడానికి రవాణా సదుపాయం లేదు. దీంతో అంబులెన్స్ సిబ్బంది కాలి నడకన ఆ గ్రామానికి చేరుకున్నారు. రోగిని గ్రామస్తులతో కలిసి డోలి మీద పడవ దగ్గరికి తీసుకొచ్చి ఎక్కించారు. దీంతో అవతల ఒడ్డుకు చేరుకోవడంతో ఆస్పత్రికి తరలించగా సకాలంలో వైద్య సేవలు అందాయి.


చోరీ కేసులో నిందితుడి అరెస్టు



అరెస్టైన రమేష్ హిమిరిక

రాయగడ: ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో చందిలి పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి కర్నిపాడు గ్రామానికి చెందిన రమేష్ హిమిరికగా గుర్తించారు. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 19వ తేదీన చందిలి పోలీసుస్టేషన్ పరిధి భామాడ గ్రామానికి చెందిన జునేష్ మండంగి అనే వ్యక్తి తన బైకు దొంగతనానికి గురైనట్లు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు హిమిరికను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. బుధవారం నిందితుడిని కోర్టుకు తరలించారు.

కలప దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలప దుంగలతో పోలీసులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి అటవీ శాఖ అధికారులు గోరక్‌పూర్ పంచాయతీలోని బురుడి మర్రిబొట్ట గ్రామంలో ఉన్నటువంటి జయసింహ జొడియా అనే వ్యక్తి ఇంట్లో మంగవారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జొడియా ఇంటి వెనుక దాచి ఉంచిన 80 కలప దుంగలు, కలప బల్లలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జొడియాను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని టికిరి అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ అనీల్ కుమార్ పాణిగ్రహి తెలియజేశారు. గత కొద్ది నెలలుగా టికిరి అటవీ ప్రాంతంలో విలువైన వృక్షాలను నరికి వాటిని కలప రూపంలోకి మార్చి అక్రమంగా వ్యాపారం చేస్తున్నారన్న వచ్చిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కొద్దిరోజుల క్రితం లెల్లిగుమ్మ సంరక్షిత అడవుల నుంచి రూ.50 వేలు విలువచేసే కలపను పికప్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. అడవుల సంరక్షణలో భాగంగా అటవీ శాఖ సిబ్బంది విస్తృతంగా దాడులు చేపడుతోందన్నారు.

కొనసాగుతున్న రభస

- శాసనసభలో మూడోరోజు గందరగోళం
- గవర్నర్ కుమారుడి అరెస్టుకు ప్రతిపక్షాల పట్టు
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆందోళన
- సభ పలుమార్లు వాయిదా



స్పీకర్ పోడియం ఎదురుగా విపక్షాల నిరసన

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో బడ్జెటు సమావేశాలకు సానుకూల వాతావరణం నెలకొనడం లేదు. వరుసగా మూడో రోజున సభా కార్యక్రమాలకు గండి పడింది. అధికార, విపక్షాల మధ్య వివాదం కొలిక్కి రాకపోవడంతో ఈ పరిస్థితి కొనసాగుతోంది. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ అధికారిపై దాడికి పాల్పడిన గవర్నర్ కుమారుడిని అరెస్టు చేయాలని విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ వివాదంపై సభలో విపక్ష బిజూ జనతా దళ్ సభ్యులు పట్టుబట్టడంతో బుధవారం గందరగోళ పరిస్థితి కొనసాగింది. ప్రశ్నోత్తరాల సమయం నుంచి విపక్షాలు గోల చేయడంతో సభని స్పీకర్ వరుసగా పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది.

బీజేడీ వాకౌట్
గవర్నర్ రఘుబర్ దాస్ కుమారుడు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌ఓ)పై దాడికి పాల్పడిన కేసులో రాష్ట్ర ప్రభుత్వం నిష్క్రియాత్మకంగా వ్యవహరించడంపై ప్రతిపక్ష బీజేడీ వాకౌట్ చేసింది. అయితే మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఒడిశాను నిర్లక్ష్యం చేయడంపై కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో స్పీకర్ సురమా పాఢి తొలుత అసెంబ్లీని గంట పాటు వాయిదా వేశారు. తదుపరి ఉదయం 11.30 గంటలకు సభ మళ్లీ సమావేశమైనప్పటికీ, అంతరాయం కొనసాగడంతో సభను మళ్లీ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లాలో అత్యధిక ప్రాంతాలు ప్రభావితం అవుతాయని కాంగ్రెస్ సభ్యులు ప్రస్తావించి దుమారం రేపారు.

బెడిసికొట్టిన అఖిల పక్ష సమావేశం
ప్రతిష్టంభనకు తెర దించేందుకు స్పీకర్ అఖిల పక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. అధికార, విపక్ష సభ్యులతో ఈ సమావేశంలో చర్చించేందుకు స్పీకర్ చేసిన ప్రయత్నాలు ఫలప్రదం కాలేదు. అనంతరం సభని ఏర్పాటు చేసినా సానుకూల వాతావరణం లేకపోవడంతో తిరిగి స్పీకర్ సభను సాయంత్రం 4 గంటలకు వాయిదా వేశారు.

డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు సహకారం
ముందస్తు కార్యక్రమం ప్రకారం బుధవారం సభలో డిప్యూటీ స్పీకరు ఎన్నిక, గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ ప్రధాన కార్యక్రమాలు. అయితే గవర్నర్ సంబంధిత కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు బిజూ జనతా దళ్ ప్రకటించింది. డిప్యూటీ స్పీకర్ ఎన్నిక నిర్వహణలో పూర్తి సహకారం అందజేసి సభలో పాల్గొంటామని ప్రకటించింది. ప్రతిష్టంభన తొలగించి సభను సజావుగా నిర్వహించడంపై రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి కనబరచడం లేదని బిజూ జనతా దళ్ నాయకుడు కలికేష్ నారాయణ్ సింగ్ దేవ్ విచారం వ్యక్తం చేశారు. సభలో ప్రతిష్టంభనను పరిష్కరించడానికి ప్రభుత్వం సభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశానికి పిలుపునివ్వడం లేదన్నారు. సభను నడపడానికి, గవర్నర్‌కు సంబంధించిన సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వానికి ఆసక్తి లేదని స్పష్టం కావడంతో సభ నుంచి వాకౌట్ చేస్తున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ ఎన్నికలో పాల్గొనడం ద్వారా పార్టీ రాజ్యాంగ కర్తవ్యాన్ని నిర్వహించిందని పేర్కొన్నారు.

ఆర్థిక సర్వే నివేదిక వెల్లడి

- సభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ ఆర్థిక సంవత్సరంలో 8.5 శాతం వృద్ధి అంచనా

భువనేశ్వర్:

రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు వెల్లడించే 2023–24 ఆర్థిక సంవత్సరపు ఆర్థిక సర్వే నివేదికను సభలో బుధవారం ప్రవేశపెట్టారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతృత్వంలో సీఎం మోహన్ చరణ్ మాఝీ ప్రభుత్వం ప్రభుత్వం తొలి బడ్జెట్ గురువారం సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్ రూపురేఖలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దీనికి ముందు బుధవారం మధ్యాహ్నం ఆర్థిక సర్వే నివేదిక విడుదలైంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఒడిశా ఆర్థిక వ్యవస్థ 8.5 శాతం వృద్ధిని సాధిస్తుందని నివేదిక అంచనా వేసింది. గతేడాది 2022–23 ఆర్థిక సంవత్సరంలో 7.9 శాతంగా వృద్ధి నమోదైంది. ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం ఒడిశా తలసరి ఆదాయం రూ.1,61,436లు. ఇది జాతీయ తలసరి ఆదాయం కంటే 12.4 శాతం తక్కువ. అయితే పరిశ్రమలు, సేవల రంగాల అభివృద్ధి కారణంగానే ఇది సాధ్యమైందని నివేదిక పేర్కొంది. అదేవిధంగా 2015–16 ఆర్థిక సంవత్సరం నుంచి ఒడిశా తలసరి ఆదాయం 12.1 శాతం పెరిగినట్లు వెల్లడించింది.

11వ స్థానంలో ఒడిశా
2022–23లో 17 ప్రధాన రాష్ట్రాల జాబితాలో ఒడిశా 11వ స్థానంలో ఉంది. నీతి అయోగ్ లెక్కల ప్రకారం 2015–16లో బహుముఖ పేదరికం నిష్పత్తి 29.3 శాతం ఉండగా, 2019–21లో అది 15.7 శాతానికి తగ్గింది. ఏడాది కాలంలో రాష్ట్రంలోని 62 లక్షల మందికి పైగా పేదరికం నుంచి విముక్తి పొందారని ఆర్థిక సర్వే నివేదిక పేర్కొంది. అయితే వ్యవసాయం మరియు సంబంధిత రంగాల వృద్ధి 3.5 శాతంగా అంచనా వేయబడింది. పారిశ్రామిక రంగం వృద్ధి రేటు 8.7 శాతంగా అంచనా వేయగా, సేవారంగం వృద్ధి రేటు 9.2 శాతంగా అంచనా వేయబడింది.

బియ్యం ఉత్పత్తిలో 5వ స్థానం
నివేదిక ప్రకారం ఒడిశా దేశంలోనే 5వ అత్యధిక బియ్యం ఉత్పాదన రాష్ట్రంగా నిలిచింది. ఒడిశాలో వివిధ పంటల దిగుబడి జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. ఒడిశాలో పప్పు ధాన్యాలకు 61 శాతం దిగుబడి అంతరం ఉన్నట్లు పేర్కొంది. 2022–23లో ఒడిశాలో తృణ ధాన్యాల (మిల్లెట్) ఉత్పత్తి 47.3 శాతం పెరిగింది. ఒడిశా మిల్లెట్ మిషన్ ప్రారంభించిన తర్వాత రాష్ట్ర తృణ ధాన్యాల ఉత్పత్తి 2017–18 నుంచి 2022–23 నాటికి 121 శాతం పెరిగింది. పాడి, మత్స్య సంపదలోనూ రాష్ట్రం వృద్ధిని సాధించింది. మాంసం ఉత్పత్తి 2021–22లో 216.2 వేల మెట్రిక్ టన్నుల నుంచి 2022–23లో 226.9 వేల మెట్రిక్ టన్నులకు పెరిగింది. పాల ఉత్పత్తి 2021–22లో 24.0 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2022–23లో 24.8 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. చేపల ఉత్పత్తి 2014–15లో 4.4 లక్షల టన్నుల నుంచి 2022–23లో 10.5 లక్షల టన్నులకు పెరిగింది. రాష్ట్రంలో ఏటా తలసరి చేపల వినియోగం 2014–15లో 11.06 కిలోల నుంచి 2022–23 నాటికి 17.73 కిలోలకు పెరిగింది. 2022–23 చివరి నాటికి ఒడిశా 2,992 కి.మీ రైల్వే మార్గాలను కలిగి ఉండగా, 2,940 కి.మీ (98.3 శాతం) విద్యుదీకరించబడింది.

విస్తరించిన విమానయాన రంగం
రాష్ట్రంలో పౌర విమానయాన రంగం విస్తరించినట్లు నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రాన్ని 19 భారతీయ నగరాలకు, మూడు అంతర్జాతీయ గమ్యస్థానాలకు కలుపుతూ విమానయాన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. బ్యాంకాక్, సింగపూర్ మరియు దుబాయ్ ప్రాంతాలకు అంతర్జాతీయ విమానయానం సులభతరమైంది. నివేదికపై ప్రతిపక్ష నేత ప్రసన్న ఆచార్య మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పథకాలు, సరైన విధానాలను అమలు చేయడంతోనే ఒడిశా అభివృద్ధి చెందిందన్నారు. గత 24 ఏళ్లలో ఒడిశాను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేశామని చెప్పుకునేందుకు గర్వపడుతున్నామని పేర్కొన్నారు.

ఆభరణాల లెక్కింపు మార్గదర్శకాలు సిద్ధం

- జస్టిస్ విశ్వనాథ్ రథ్



జస్టిస్ విశ్వనాథ్ రథ్

భువనేశ్వర్: శ్రీమందిరం రత్న భాండాగారం నిర్వహణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయ్యాక రత్న భాండాగారం రెండు గదుల నుంచి తొలగించిన అమూల్య రత్న సంపదని యథాతథంగా అక్కడే భద్రపరచాల్సి ఉంది. అంతకుముందే ఈ ఆభరణాలను లెక్కించి పూర్వాపరాల నిర్ధారణతో భావితరాలకు సవివరంగా జాబితా రూపొందించాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వం ఆమోదంతో ప్రత్యేక మార్గదర్శకాలు సిద్ధంగా ఉన్నాయని శ్రీమందిరం రత్న భాండాగారం ఉన్నత స్థాయి పరిశీలన కమిటీ అధ్యక్షుడు జస్టిస్ విశ్వనాథ్ రథ్ తెలిపారు. ఆయన బుధవారం పూరీ సందర్శించిన సందర్భంగా సంక్షిప్తంగా మీడియాతో స్పందించారు. రత్న భాండాగారం రెండు గదులు ఖాళీ చేయించి వాటిలో నగలు, ఆభరణాలు వగైరా అమూల్య సంపదని సురక్షితంగా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లకు తరించడంతో ప్రాథమిక దశ పనులు ముగిశాయన్నారు. రెండు గదులు ఖాళీ అవ్వడంతో మరమ్మతులు, పునరుద్ధరణ ఇతరేతర అనుబంధ కార్యకలాపాలను చేపట్టేందుకు భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ)కి అప్పగించినట్లు వెల్లడించారు. ఈ పనులను ఏఎస్‌ఐ చురుకుగా చేడుతోందని పేర్కొన్నారు. వీరి పనులు పూర్తయ్యాక తదుపరి దశ పనుల్లో భాగంగా ఆభరణాల లెక్కింపు అనుబంధ ప్రక్రియ ఆరంభిస్తామన్నారు. రత్న భాండాగారంలో రహస్య నిధి, సొరంగ మార్గాలు వంటి వాటికి సంబంధించి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎటువంటి దాఖలాలు తారసపడలేదని మరోసారి స్పష్టం చేశారు. అత్యాధునిక వైజ్ఞానిక, సాంకేతిక పరిజ్ఞానంతో రత్న భాండాగారం నిర్వహణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యాచరణకు ప్రభుత్వం ఆమోదించిన మార్గదర్శకాలను ఆచరించడం జరుగుతుందన్నారు. ఈసారి చేపడుతున్న నిర్వహణ పనులతో దాదాపు మరో 100 ఏళ్ల వరకు రత్న భాండాగారానికి ఎటువంటి మరమ్మతులు అవసరం లేకుండా ఉంటుందని భరోసా ఇచ్చారు. అందుబాటులో ఉన్న స్వామివారి ఆస్తులను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం



స్మితారాణి మహంతి

భువనేశ్వర్: ఫుల్బాణి మున్సిపల్ చైర్‌పర్సన్ స్మితారాణి మహంతి పదవి కోల్పోయారు. ఆమెపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఈ పరిస్థితి నెలకొంది. 2022 సంవత్సరం మార్చి 30న జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో బీజేపీకి చెందిన స్మితారాణి మహంతి విజయం సాధించారు. ఇటీవలి కాలంలో పురపాలక సంస్థ రోజువారీ కార్యకలాపాల్లో అవకతవకలు, పక్షపాత వైఖరి ఆరోపణలను కౌన్సిలర్లు లేవనెత్తారు. వీరంతా కంధమల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పాటిల్‌కు స్మితారాణి మహంతిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారు. మంగళవారం ఆమెకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశంలో ఓటింగ్ నిర్వహించారు. 13 మంది కౌన్సిలర్లు ఉండగా, 11 మంది అవిశ్వాస తీర్మానం ఓటింగ్‌లో పాలుపంచుకున్నారు. ఈ ఓటింగ్‌లో ఆమెకు వ్యతిరేకంగా 10 ఓట్లు నమోదు కాగా, ఒక ఓటు రద్దయింది. ఈ ఫలితాల ఆధారంగా స్మితా రాణి మహంతి విశ్వాసం కోల్పోయినట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

- కొరాపుట్ ఎస్పీ అభినవ సోన్‌కార్



మాట్లాడుతున్న ఎస్పీ అభినవ సోన్‌కార్

జయపురం: సమాజంలో మార్పు తీసుకు రావడానికి ప్రజలు నిర్భయంగా పోలీసులకు సహకరించాలని కొరాపుట్ ఎస్పీ అభినవ సోన్‌కార్ కోరారు. పట్టణంలోని పోలీసుస్టేషన్ ప్రాంగణంలో 'ఆమె పోలీసు సమితి' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు యంత్రాంగం ప్రజల రక్షణకే ఉందన్నారు. అసాంఘిక శక్తులను అణిచివేయాలంటే ప్రజల మద్దతు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన అన్ని సీసీ కెమెరాలు సక్రమంగా పని చేస్తున్నాయని, అలాగే ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా భయపెట్టి చందాలు వసూలు చేస్తే తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జయపురం ఎస్డీపీవో అంకిత కుమార్ వర్మ, పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయి, సదర్ పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర చంద్రతండి తదితరుల పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



కాలువలు పరిశుభ్రం చేస్తున్న దృశ్యం

కొరాపుట్:

నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. గత 15 రోజులుగా ఈ ప్రాంతంలో ఆగకుండా కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మురుగు కాలువలు శుభ్రం చేయడం పారిశుద్ధ్య కార్మికులకు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో జేసీబీతో చెత్తను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు తప్పేలా చర్యలు తీసుకుంటున్నారు.

కరెంటు షాక్‌తో ఎలుగుబంటి మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలుగుబంటి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి సీక్‌పల్లి పంచాయతీ ఎంవీ 17 గ్రామం వద్ద మంగళవారం రాత్రి అంగన్‌వాడీ కేంద్రం వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగిలి ఒక ఎలుగుబంటి మృతి చెందింది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన రైతులు చూసి మల్కన్‌గిరి అటవీ శాఖ వారికి సమాచారం ఇవ్వగా, వారు వెళ్లి చూసేసరికి మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని అటవీ శాఖ అడవిలో పూడ్చివేశారు.

గంజాయితో ఒకరు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: గుట్టుచప్పుడు లేకుండా కారులో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఒక యువకుడిని జిల్లాలోని పద్మపూర్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 47 కిలోల గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్, కారును స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం పద్మపూర్ పోలీసులు తొటిరిబంద్ కూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో పద్మపూర్ నుంచి ఒక కారు వస్తుండగా కారును ఆపి తనిఖీ చేశారు. కారులో రెండు బ్యాగుల్లో గంజాయి పట్టుబడింది. గంజాయిని రవాణా చేస్తున్న సుమెంత మాఝి అనే యువకుడిని పోలీసులు పట్టుకుని బుధవారం కోర్టుకు తరలించారు.

పెట్రోల్ పోసుకొని వృద్ధుడి ఆత్మహత్య



మృతుడి కుటుంబీకులను విచారిస్తున్న పోలీసులు

పి.మురళి (ఫైల్)

రాయగడ: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఒక వృద్ధుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక చెక్కగుడకు వెళ్లే మార్గంలోని డీపీసీ కార్యాలయం సమీపంలో నివసిస్తున్న పి.మురళి (65) అనే వృద్ధుడు తన ఇంటి పెరట్లోని బాత్ రూమ్‌లో ఈ దారుణానికి పాల్పడ్డాడు. సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సగం కాలిన మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. వృద్ధుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య రోజు కూలి పనులకు వెళ్తుండగా, కుమారులు ఇద్దరూ చిరు వ్యాపారం చేసుకుంటున్నారు. వృద్ధుడు తన ఇంటి వద్దనే బాటిళ్లలో పెట్రోల్ ఉంచి విక్రయాలు చేస్తుంటాడు. గత కొద్ది రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని సమాచారం. దీంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాకపోకల నియంత్రణకు చర్యలు

జయపురం: అప్పర్ కొలాబ్ సాగునీటి కెనాల్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు నివారించేందుకు కొలాబ్ ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గాంధీ జంక్షన్ నుంచి పాత ఆర్ఎంసీ రోడ్డు వరకు వాహనాలను నియంత్రించేందుకు ఇనుప గేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కెనాల్ రోడ్డులో భారీ వాహనాలు నడుపుతుండడం వలన రోడ్డు పాడవుతోందని పేర్కొన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం స్కాలర్‌షిప్స్ అందజేత



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ని కృష్ణ తన తండ్రి జ్ఞాపకార్థం స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో అప్లైడ్ సైన్స్ సబ్జెక్టులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ బుధవారం అందజేశారు. ప్రతిఏటా తన తండ్రి పేరుమీద ఉత్తమ విద్యార్థులకు ఆయన నగదు బహుమతి అందజేస్తున్నారు. దీనిలో భాగంగా 9వ తరగతికి చెందిన రోహాన్ కుమార్ పోరిచ్చా, సందీప్ కుమార్ మహారాణాలకు రూ.4 వేలు నగదు పురస్కారం, 10వ తరగతి చదువుతున్న అనేస్ బోరాడో, నవీన్ కుమార్ బెహరాలకు రూ.5 వేలు నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ని కృష్ణ మాతృమూర్తి ఎన్ని శారద, హెచ్ఎం మోనాలిసా దాస్, ఉపాధ్యాయులు వై.ధర్మారావు, డి.శ్రీరాంమూర్తి, జగన్నాథ పట్నాయక్, సస్మితా మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగ శిక్షణ శిబిరాలు



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

జయపురం: కొరాపుట్ జిల్లా సునాబెడ, జయపురంలలో యోగ శిక్షకులకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పతాంజలి యోగ సమితి రాష్ట్ర ప్రభారీ జాకని పాణిగ్రాహి తెలియజేశారు. శిబిరాల్లో 41 మంది యోగ ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారని వెల్లడించారు. వారిలో పంచానన కల్యాణ మండపం ప్రాంతంలో 23 మంది, సునాబెడలో 18 మంది శిక్షణ పొందుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఆసనాలు, ప్రాణాయం, సూర్య నమస్కారాలు, వ్యాయామాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా పతాంజలి జిల్లా అధ్యక్షుడు అంబికా రంజన్ పాణిగ్రాహి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో సావిత్రి బెహర, అంజలి సామల్, అనుక సామల్, టి.స్మిత షరాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.4,16,514 ఆర్థికసాయం



కార్మికుడి కుటుంబానికి సాయం అందిస్తున్న తోటి కార్మికులు, నాయకులు

రణస్థలం: మండలంలోని వరిసాం వద్ద శ్యాం పిస్టన్స్ పరిశ్రమలో పనిచేస్తూ కార్మికుడు పంచిరెడ్డి దుర్గాప్రసాద్ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి అండగా ఉండేందుకు తోటి కార్మికులంతా ఒక రోజు వేతనం రూ.4,16,514 సేకరించారు. ఆ మొత్తాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, శ్యాంక్రగ్ పిస్టన్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొర్లె కిరణ్ చేతుల మీదుగా అతని కుటుంబానికి పరిశ్రమ వద్ద బుధవారం అందజేశారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్ భార్య పి.పావని, యూనియన్ నాయకులు ఎం.కూర్మారావు, ఎన్.నాగేశ్వరరావు, జయరాం, జి.ఈశ్వరరావు, రామారావు, తోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 30, 31 తేదీల్లో సెమినార్




బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 30, 31 తేదీల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్ అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ కె.ఆర్.రజిని తెలిపారు. ఈ మేరకు బుధవారం సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విభాగం నుంచి జాతీయ స్థాయి సెమినార్లు నిర్వహించాలని సూచించారు. వీటి వల్ల విజ్ఞాన మార్పిడి, విషయ పరిజ్ఞానం, సాంకేతిక అంశాలపై విద్యార్థులకు పట్టు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ కూన అమృతరావు, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.వి.మహేశ్వరరెడ్డిని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో ఉమ్మడి జిల్లాల ప్రాంతీయ విజిలెన్స్ అధికారి, జేడీ ఎ.సురేష్‌బాబు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.చంద్రశేఖరరెడ్డి, సెబ్ శ్రీకాకుళం డివిజన్ ఎన్‌ఫోర్స్ సూపరింటెండెంట్ సీహెచ్ తిరుపతినాయుడు, శ్రీకాకుళం ఆర్టీసీ రెండు డిపోల మేనేజర్లు మల్లికార్జునరాజు, శర్మ తదితరులు ఉన్నారు.

రూ.2 లక్షల విలువైన సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

కాశీబుగ్గ: రైల్వే ప్రయాణికుల నుంచి చోరీకి గురైన సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకుని తిరిగి బాధితులకు అందజేసినట్లు పలాస జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్ బుధవారం తెలిపారు. మొత్తం ఆరు మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని, వీటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పలాస జీఆర్‌పీ క్రైమ్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ పి.కోదండరావు, కానిస్టేబుళ్లు ఎం.సంతోష్‌కుమార్, పి.రమేష్‌బాబు, జె.అనిత పాల్గొన్నారు.

కమలా పూజారికి నివాళులు



మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి వాసన్ తదితరులు



కమల పూజారి సేవలు వివరిస్తున్న ప్రశాంత కుమార్ పరిడ



కమలా పూజారి విత్తన భాండాగారం ప్రారంభిస్తున్న దృశ్యం

జయపురం: సమితిలోని పూల్‌బెడ గ్రామంలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత పద్మశ్రీ కమల పూజారి సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తివాసన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమల పూజారి వ్యవసాయ రంగానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆమె మరణం కేవలం కొరాపుట్ జిల్లాకే కాకుండా సమగ్ర ఒడిశాకే తీరనిలోటని అన్నారు. రీసెర్చ్ కేంద్రంలో విత్తన భాండాగారాన్ని ప్రారంభించి దానికి కమలా పూజారి విత్తన భండాగారం అని నామకరణం చేశారు. ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రశాంత కుమార్ పరిడ మాట్లాడుతూ కమలా పూజారి దేశీ విత్తన సంరక్షణ, ప్రచారం చేపట్టి రైతులను సచేతనులను చేశారన్నారు. అంతకుముందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ, అదనపు వ్యవసాయ అధికారి లయిచన్ చరణ్ మఝి, ఒడిశా విత్తణ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ జయపురం, శశికాంత దాస్, జిల్లా ఉద్యానవన అదనపు అధికారి సంజీవ కుమార్ మహంతి, జిల్లా మత్స్య విభాగ అధికారి త్రివేణీ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్



ఓటు వేసేందుకు బారులుతీరిన వాటాదారులు

భువనేశ్వర్: అవిభాజిత ఆగ్నేయ రైల్వే సిబ్బంది సహకార సంస్థ (అర్బన్ బ్యాంకు) ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం తొలి విడత పోలింగ్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జోన్ వ్యాప్తంగా నిరధికంగా కొనసాగింది. తూర్పు కోస్తా రైల్వే పరిధిలో వాల్తేరు, ఖుర్దారోడ్ మరియు సంబలపూర్ మండలాల్లో పోలింగ్ నిర్వహించారు. జోన్ వ్యాప్తంగా 211 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. ఈ విడతలో వాల్తేరు మండలంలో సగటు పోలింగ్ 70 శాతం, ఖుర్దారోడ్‌లో 67 శాతం పోలింగ్ జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రెండో విడత పోలింగ్ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. తొలి విడత పోలింగ్‌లో ఓటు వేయలేకపోయిన వాటాదారు సిబ్బంది సౌకర్యం కోసం ఈ వెసులుబాటు కల్పించారు. కనీసం 125 మంది వాటాదారు ఓటర్ల ప్రామాణికంగా ఓటు వేసేందుకు ఒక్కో నియోజకవర్గం ఖరారు చేశారు. ఈ లెక్కన తూర్పు కోస్తా రైల్వేజోన్ వ్యాప్తంగా 211 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. వీటిలో ఖుర్దారోడ్ మండలంలో అత్యధికంగా 98, వాల్తేరు మండలంలో 84, సంబలపూర్ మండలంలో అతి తక్కువగా 29 నియోజకవర్గాల్లో పోలింగ్ కోసం ఏర్పాటు చేశారు. రెండు విడతల పోలింగ్ ముగియడంతో జోన్‌లో సమగ్రంగా 211 మంది డెలిగేట్ల ఎన్నిక పూర్తి అవుతుంది. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో ఓట్లు లెక్కింపు ప్రారంభిస్తారు. వెంబడి ఫలితాలు ప్రకటిస్తారు.

మజ్జిగౌరి హుండీ ఆదాయం లెక్కింపు



అమ్మవారు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సేవా సమితుల సభ్యులు

రాయగడ: ఉత్కలాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి మజ్జిగౌరి అమ్మవారికి భక్తులు సమర్పించే కానుకల హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు పాలకొండ ప్రకాష్, పెద్దిన వాసు, దేవేంద్ర బెహర, తహసీల్దార్ ప్రియదర్శిని స్వయిల సమక్షంలో అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని 9 హుండీలను తెరిచారు. స్థానిక వేంకటేశ్వర మందిరానికి చెందిన సేవా సమితి, సాయిబాబా సేవా సమితులకు చెందిన సుమారు రెండు వందల మంది సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు తెరిచిన హుండీ ఆదాయ లెక్కింపు రాత్రి పదిన్నర గంటల వరకు కొనసాగింది. పోలీసుల కట్టుదిట్టమైన కాపలా మధ్య కొనసాగిన ఈ లెక్కింపులో బంగారం 53 గ్రాములు, వెండి 2 కిలోల 390 గ్రాములు లభించాయి. అదేవిధంగా భక్తులు కానుకల రూపంలో వేసిన నగదు రూ.99,15,422 వచ్చింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది మార్చి 18వ తేదీన లెక్కించిన హుండీ ఆదాయం రూ.89,72,225లు, 62 గ్రాముల బంగారం, 2 కిలోల 300 గ్రాముల వెండి లభించాయి. అయితే నాలుగు నెలల తర్వాత ఇప్పుడు మరలా హుండీ తెరిచారు. హుండీలో లభించిన ఆదాయాన్ని యూనియన్ బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగ్ బిడిక తెలియజేశారు.



హుండీలో నగదు తీస్తున్న సిబ్బంది

కళాకారులకు అవార్డులు



మాట్లాడుతున్న ఫౌండేషన్ సభ్యులు

రాయగడ: కళారంగంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సేవలందించిన కళాకారులను గుర్తించి, వారిని ప్రోత్సాహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మా మఝిగౌరి ఎంటర్‌టైన్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 4వ తేదీన స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో రాయగడ టాలెంట్ అవార్డులను అందిస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్ కుమార్ బొచ్చ తెలియజేశారు. ఈ మేరకు స్థానిక సాయిప్రియనగర్ రెండోలైన్‌లోని చిల్డ్రన్స్ పార్క్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. భాష, సంస్కృతి, కళలను పరిరక్షించేందుకు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభను కనబరుస్తున్న కళాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ప్రియదర్శిని హుయిక, ప్రిన్స్ గుప్తా, ఇందు ప్రియదర్శిని హుయిక, సిద్దార్థ్ మల్లిక్, గణేష్ బెహర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విశ్రాంత శ్రామికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విశ్రాంత శ్రామికులు

జయపురం: నగరంలోని గగనాపూర్ వద్దనున్న సేవా పేపరు మిల్లు ప్రధాన గేటువద్ద విశ్రాంత శ్రామికులు ఆందోళన కొనసాగిస్తున్నారు. జూలై 1వ తేదీ నుంచి గేటు ముందు ప్రతిరోజూ తాము ఆందోళన చేస్తున్నా మిల్లు యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018 నుంచి తమకు వేతనం, పీఎఫ్, పెన్షన్ బకాయిలు చెల్లించాల్సి ఉన్నా యాజమాన్యం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. 2020 సంవత్సరంలో రిటైరైన శ్రామికులకు ఇప్పటివరకు బకాయిలు చెల్లించలేదని, వారిలో ఇప్పటికే 37 మంది మరణించారని తెలిపారు. మృతి చెందిన శ్రామికుల కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని, వారి పిల్లల చదువులు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఎలుగు దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న చైతన్య ముదులి

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి కమరా గ్రామ పంచాయతీ సోలాగుడ గ్రామంలో ఒక 15 ఏళ్ల బాలుడు గురువారం ఉదయం పశువులను మేపేందుకు అడవికి తీసుకెళ్లాడు. దీంతో అడవిలో ఒక భల్లూకం అకస్మాత్తుగా అ బాలుడిపై దాడి చేసింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పూర్ణ ముదులి కుమారుడు చైతన్య ముదులి(15) పశువులు తీసుకొని అడవికి వెళ్లాడు. అడవిలో అకస్మాత్తుగా ఒక ఎలుగు అతడిపై దాడి చేయగా ప్రాణభయంతో హాహాకారాలు చేశాడు. అతడి కేకలు విన్నటువంటి సమీప ప్రాంతాల్లో ఉన్నవారు పరుగు పరుగున వచ్చి బాలుని రక్షించారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని మొదట బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అతడిని కొరాపుట్ సాహిద్ లక్ష్మణ నాయక్ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: భయంకరమైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తమ తండ్రిని ఆదుకోవాలని కోరుతూ 'మా నాన్నను బతికించండి' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. బాధితుడు పతాన రోహిణీ కుమార్‌కు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, తేలుకుంచి సర్పంచ్ పాతిర్ల రాజశేఖరెడ్డి రూ.5వేలు, పశువైద్యాధికారి డాక్టర్ మంజుల నారాయణరావు రూ.రెండు వేలు, రమేష్ వెయ్యి రూపాయలను బుధవారం అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి తండ్రి వైద్యానికి ఆర్థిక సాయం చేయాలని చిన్నారులు కోరుతున్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న రాజశేఖరరెడ్డి



ఈ-క్రాప్‌పై నీలినీడలు!

- నమోదు కోసం ఎదురుచూస్తున్న రైతులు
- స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 1.68 లక్షల హెక్టార్లు

హిరమండలం :

అన్నదాతలకు అండగా నిలిచే ఈ-క్రాప్ పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇప్పటికే రైతుభరోసా పథకం కింద పంట సాయం అందక ఆందోళన చెందుతున్న రైతులకు.. ఈ-క్రాప్ నమోదుపైనా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆగ్రహం కలిగిస్తోంది. గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, ఈ-క్రాప్, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు విజయవంతంగా అమలు చేసింది. ఈసారి అమలవుతాయో లేదోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో గత ఏడాది ఖరీఫ్‌లో 1,53,785 హెక్టార్లలో సాగుచేయగా 1,43,837 హెక్టార్ల మేర పంటలకు ఈ-క్రాప్ నమోదు చేశారు. రబీలో 53,005 హెక్టార్లులో సాగుచేయగా 49724 హెక్టార్లకు ఈ-క్రాప్ నమోదు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,68,662 హెక్టార్లలో పంట సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయగా ఇప్పటికి 88,552 హెక్టార్లలో పంటలు సాగుచేస్తున్నారు.

పొలం పనుల్లో బిజీ..

జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రైతన్నలు సాగుకు ఉపక్రమించారు. అదును చూసుకుని విత్తనాలు చల్లుతున్నారు. కొందరు ఇప్పటికే వెద పద్ధతిలో వరి విత్తనాలు చల్లారు. ఏటా పంటల సాగు సమయంలో పొలాలకు వచ్చే వ్యవసాయ సిబ్బంది ఇప్పుడు కనిపించకపోవడంతో కలవరపడుతున్నారు. ముఖ్యంగా ఈ-క్రాప్ నమోదుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆదందోళన నెలకొంది. పంట నమోదు కాకుంటే ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో ఇబ్బందులు తప్పవని బెంగపడుతున్నారు. దీనిపై స్థానికంగా ఉండే వ్యవసాయ సిబ్బందిని ఆరా తీస్తున్నా సరైన సమాధానం లేక దిగులు చెందుతున్నారు. పంటల సాగుకు ఎరువులు కొనాలన్నా, పంటలు విక్రయించుకోవాలన్నా, పంట నష్టం జరిగినప్పుడు పంటబీమా పొందాలన్నా ఈ-క్రాప్ తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యమున్న పంటల నమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వం ఆలస్యం చేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయంలో ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి భరోసా అందేది. కొత్త ప్రభుత్వం కొలువుదీరి రోజులు గడుస్తున్నా పెట్టబడి సాయం అందక ఆవేదన చెందుతున్నారు.



గత ప్రభుత్వం లో ఈ-క్రాప్ నమోదు చేస్తున్నవ్యవసాయ సిబ్బంది (ఫైల్)

ఆదేశాలు రాలేదు..



ఖరీఫ్ సీజన్‌కు ఈ-క్రాప్ విధానం అమలుపై ప్రభుత్వ పరంగా ఆదేశాలు అందలేదు. వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. త్వరలో ప్రభుత్వం ప్రకటించే నిర్ణయం ప్రకారం రైతులకు మేలు చేసేలా వ్యవసాయాధికారులు, సిబ్బంది తోడ్పాటు అందిస్తాం.

– కె.శ్రీధర్, జేడీఏ, శ్రీకాకుళం

కొనసాగించాలి..



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోతే రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ-క్రాప్ చేయకపోతే పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర పొందే అవకాశం కోల్పోతాం. వెంటనే ప్రభుత్వం ఈ-క్రాప్ విధానాన్ని కొనసాగిస్తే రైతులకు మేలు జరుగుతంది. – వై.రాజారావు, రైతు తంప గ్రామం, హిరమండలం మండలం

గతంలో ఇలా...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఈ-క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసేది. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభమైన వెంటనే ఈ-క్రాప్ ప్రక్రియ ప్రారంభించేది. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ ప్రక్రియను నిర్వహించేవారు. పంటలు సాగుచేసిన రైతులను పొలం వద్ద ఉంచి ఫొటోలు, వివరాలు యాప్‌లో నమోదు చేసేవారు. ఇవన్నీ ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రంలో నిక్షిప్తమయ్యేవి. ఈ-క్రాప్ ఆధారంగానే ఎరువులు, పురుగుమందులు, నాణ్యమైన విత్తనాలు రాయితీపై లభించేవి. రైతులకు ప్రభుత్వమే బీమా సొమ్ము చెల్లించి ఉచితంగా పంటల బీమా చేయించడం ద్వారా రైతులు సాగు పట్ల ధీమాగా ఉండేవారు. పండితే పంట, లేకుంటే బీమా వస్తుండేది. ఈ-క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం పంట కొనుగోలు చేసేది. భూమిని బట్టి ఇన్‌పుట్ సబ్సిడీని త్వరితగతిన మంజూరు చేసేది. రైతులు పంట ఉత్పత్తులను తనకు నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరలకు విక్రయించే అవకాశం లభించేది. రైతు భరోసా కేంద్రంలో కొనుగోలు చేసే ప్రతి ఉత్పత్తికి రసీదులు అందజేయడం ద్వారా క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సహాయకులు పారదర్శకత పాటించేవారు.

క్లుప్తంగా

నేడు ఐటీడీఏ పీవో బాధ్యతల స్వీకరణ



రాహుల్‌కుమార్ రెడ్డి, ఐటీడీఏ పీవో

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ నూతన ప్రాజెక్టుఅధికారిగా రాహుల్ కుమార్ రెడ్డి గురువారం విధుల్లో చేరనున్నట్లు ఐటీడీఏ అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఇక్కడ పనిచేసిన ఐటీడీఏ పీవో శుభం బన్సల్ తిరుపతి జేసీగా బదిలీ అయిన విషయం విదితమే.

సర్వే రాళ్ల అడ్డగింత



ఆటోలో అక్రమంగా తరలిపోతున్న సర్వేరాళ్లు

వీరఘట్టం: మండలంలోని బూరగ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న సర్వే రాళ్లను బుదవారం ఓ ఆటో డ్రైవర్ తన ఆటోలో వేసుకుని తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ప్రభుత్వానికి చెందిన ఈ రాళ్లను తరలిస్తున్న ఆటో డ్రైవర్‌కు చీవాట్లు పెట్టారు. వెంటనే ఆ రాళ్లు అక్కడే విడిచిపెట్టి ఆటో డ్రైవర్ పలాయనం చిత్తగించాడు. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న ఈ సర్వేరాళ్లను చాలా మంది తమ అవసరాల కోసం అక్రమంగా తరలించుకుపోతున్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి ఈ రాళ్లను తహసీల్దార్ కార్యాలయం వద్ద భద్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

పెదకుదమ-చినకుదమ మధ్య గజరాజులు



పెదకుదమ-చినకుదమ గ్రామాల మధ్య ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ-చినకుదమ గ్రామాల మధ్య ఏనుగులు సంచరిస్తున్నాయి. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం సింగనాపురం గ్రామం నుంచి పెదకుదమ, చినకుదమ గ్రామాల మధ్య పంటపొలాల్లో ఏనుగులు దర్శనమివ్వడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.అరటి పంట పక్వదశలో ఉందని పంటను ధ్వంసం చేస్తే నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.రాత్రి సమయాన గ్రామాల్లోకి చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని భీతిల్లుతున్నారు. అటవీశాఖాధికారులు వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

నిలకడగా తోటపల్లి ప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టువద్ద పరిస్థితి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టువద్ద నీటి ప్రవాహం నిలకడగా ఉంది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద బుధవారం సాయంత్రానికి 105 మీటర్ల లెవెల్‌కు గాను 104.10 మీటర్ల లెవెల్‌లో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిపై భాగం నుంచి ప్రాజెక్టుకు 2వేల క్యూసెక్కుల నీరు రాగా అధికారులు రెండు గేట్లు ఎత్తివేసి 2,139 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువల ద్వారా 210 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.53 టీఎంసీలకు గాను 2.2 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టువద్ద నీటిపరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.


దివ్యాంగుల జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: దివ్యాంగుల జాతీయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎ.డి కె.కవిత తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసారు. డిసెంబర్ 3 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు, దివ్యాంగుల సాధికారత కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలకు జాతీయ స్థాయి అవార్డు ప్రదానం చేయడానికి భారత ప్రభుత్వం సామాజిక న్యాయము, సాధికారత మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ అవార్డుల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. అవార్డ్స్.కాంలో ఈ నెల31 లోపల ఆన్ లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలు, విధివిధానాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. డీఈపీడబ్ల్యూ. జీఓవీ.ఇన్‌కు సందర్శించాలని కోరారు.

సైబర్ టెర్రర్..!



- క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ!
- ఏపీకే ఫైల్స్ పంపుతూ సమాచారం తస్కరణ
- నేరగాళ్ల వలలో పడి డబ్బు పోగొట్టుకుంటున్న అమాయకులు
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- ఇటీవల కలెక్టర్ పేరిట బురిడీ కొట్టించిన కేటుగాళ్లు



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేరిట నకిలీ వాట్సాప్ ఖాతా

సాక్షి, పార్వతీపురం మన్యం/మక్కువ: ఈ చిత్రంలో ఉన్నది పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేరిట ఉన్న నకిలీ వాట్సాప్ ఖాతా. +977 నంబర్‌తో సైబర్ నేరగాళ్లు కలెక్టర్ ఫొటోతో వాట్సాప్ ఖాతాను సృష్టించి..ఆయనే చాట్ చేస్తున్నట్లుగా కొంతమందిని నమ్మించారు. అవసరం ఉందని చెప్పి డబ్బులు అడిగారు. అప్పటికి కలెక్టర్ కొత్తగా రావడం..అది ఆయన నంబరే అని భావించి చాలామంది జిల్లా అధికారులు అడిగినంత డబ్బులు సదరు వ్యక్తి చెప్పిన ఖాతాకు పంపించినట్లు సమాచారం. బయటకు తెలిస్తే పరువు పోతుందని చెప్పుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కొంతమంది సాహసించి కలెక్టర్ దృష్టిలో ఈ విషయాన్ని పెట్టగా ఆయన వెంటనే అందరినీ అప్రమత్తం చేసి పోలీసుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు భాగవతుల కిరణ్‌కుమార్. మక్కువ మండలం మార్కొండపుట్టి గ్రామం. వారం రోజుల క్రితం అతని మొబైల్ ఫోన్‌కు 'డియర్ యూజర్..మీ యూనియన్ బ్యాంక్ అకౌంట్ డీ యాక్టివ్ అయింది. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల'ని సంక్షిప్త సందేశం వచ్చింది. అందుకోసం ఏపీకే ఫైల్ పేరిట ఒక లింక్ కూడా పంపారు. ఆ లింకును తెరవగానే..అతని ప్రమేయం లేకుండానే ఆటోమేటిక్‌గా ఆధార్ కార్డు నంబర్, ఓటీపీ అన్నీ ఎంటర్ అయిపోయాయి. వెంటనే అతని ఖాతాలో ఉన్న రూ.3 వేలు మాయమైపోయాయి. ఇదే తరహాలో మక్కువలోని బ్రాహ్మణవీధికి చెందిన కార్తీక్ అనే వ్యక్తి ఫోన్ హ్యాక్ చేసి రూ.2 వేలు డ్రా చేసుకున్నారు. మండలంలోని మరో గ్రామానికి చెందిన ఉపాధ్యాయుని ఖాతా నుంచి రూ.25 వేలు ఆయనకు తెలియకుండానే డ్రా అయిపోయాయి.

కొత్తకొత్త ఎత్తుగడలు

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో రకంగా కొత్త ఎత్తుగడలతో మోసాలకు పాల్పడుతూ, ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఎవరూ ఊహించని విధంగా ఫోన్లలోకి చొరబడి, వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తున్నారు. క్షణాల్లో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. మొన్నటి వరకు ఫేస్‌బుక్ ఖాతాలను హ్యాక్ చేసి, అందులో ఉన్న వారందరికీ మళ్లీ ఫ్రెండ్ రిక్వెస్టులు పెట్టి, మెసేంజర్ ద్వారా చాట్ చేసి డబ్బులు అడిగేవారు. తమకు తెలిసిన వారే కదా అడుగుతున్నారని చాలామంది డబ్బులు వేసి, మోసపోయేవారు. ఆ తర్వాత మన పేరిటే మనకు తెలియకుండానే నకిలీ వాట్సాప్ ఖాతాలు సృష్టించడం మొదలుపెట్టారు. మన ఫేస్‌బుక్‌లోనో, ఇతర సామాజిక మాధ్యమాల్లోనో మన ఫొటోను తస్కరించి..దానినే డీపీగా పెట్టుకుని కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు వాట్సాప్ మెసేజ్‌లు పంపుతూ మోసానికి తెర తీస్తున్నారు. పెద్ద ఎత్తున నగదును తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. ఇప్పుడు ఏపీకే(ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ) ఫైళ్లను వాట్సాప్ ద్వారా పంపి, తద్వారా ఫోన్లలో విలువైన సమాచారాన్ని తస్కరిస్తున్నారు. ఆపై ఖాతాల నుంచి డబ్బు డ్రా చేస్తున్నారు. విషయం తెలియక చాలా మంది ఈ ఫైళ్లపై క్లిక్ చేస్తున్నారు. ఫలితంగా ఫోన్ హ్యాక్ అయి, నియంత్రణ మొత్తం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తోంది. మరికొంతమంది కేటుగాళ్లు..బ్యాంకులు, పోస్టాఫీసుల పేరిట సందేశాలు పంపుతున్నారు. ఖాతా డీయాక్టివ్ అయిందని, వెంటనే ఈ లింకు తెరిచి యాక్టివ్ చేయకపోతే, మొత్తం బ్లాక్ అయిపోతుందని హెచ్చరిస్తున్నారు. ఎవరైనా పొరపాటున దానిని క్లిక్ చేస్తే వెంటనే ఫోన్ హ్యాక్ చేసి, ఖాతాలోని నగదును మాయం చేస్తున్నారు.



ఓ ఖాతాదారుడికి యూనియన్ బ్యాంకు నుంచి వచ్చినట్లు నమ్మిస్తూ పంపిన ఏపీకే ఫైల్

ఆధునిక సాంకేతికను ఉపయోగిస్తూ..

సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను సులువుగా వినియోగించుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారు. వినియోగదారుల ఫోన్లలో మాల్‌వేర్‌ను చొప్పించేందుకు ఏపీకే ఫైళ్లను రూపొందిస్తున్నారు. కొరియర్, బ్యాంకు ప్రతినిధులు, కస్టమర్ కేర్, పోస్టల్ ఏజెంట్లు, వివిధ గ్రూపుల్లో చేరేందుకు ఆహ్వానం..ఇలా రకరకాల పేర్లతో వాట్సాప్‌ల ద్వారా పంపిస్తున్నారు. క్లిక్ చేస్తే వివరాలు వస్తాయని చెప్పి, నమ్మించి డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. వాటిని ఇన్‌స్టాల్ చేయగానే ఫోన్ మోసగాళ్ల నియంత్రణలోకి వెళ్లిపోతుంది. వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు, సందేశాలు, బ్యాంకు ఖాతాల వివరాలు అన్నీ సులభంగా అవతలి వ్యక్తులకు చేరతాయి. బ్యాంకు ఖాతాలను సేకరించి, నగదును అనధికారికంగా డ్రా చేస్తున్నారు. జిల్లాలో ఈ తరహా ఘటనలు ఇప్పుడు ఎక్కువయ్యాయి. ప్రతి మండలంలోనూ బాధితులు ఉన్నారు. మోసగాళ్ల వలలో పడి రూ.వేలు, లక్షల్లో పోగొట్టుకుంటున్నారు.

వివరాలు అడిగి, ఖాతా ఖాళీ చేశారు..

నా ఫోన్‌లో నెట్ బ్యాంకింగ్ ఉంది. ఇటీవల సేవలు ఆగిపోయాయి. అదే సమయంలో తెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నట్లు నమ్మబలికారు. నా ఖాతా, ఏటీఎం నంబర్, ఇతర వివరాలు అడిగారు. నేను నిజమని నమ్మి, సమాధానమిచ్చాను. వెంటనే నా ఫోన్‌ను హ్యాక్ చేశారు. బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.2,200 మాయం చేశారు. వాట్సాప్‌ను కూడా హ్యాక్ చేసి కాంటాక్ట్ లిస్టులో ఉన్న అందరికీ నా ప్రమేయం లేకుండానే మెసేజ్‌లు పంపారు. నాలాంటి బాధితులు చాలామంది ఉన్నారు. పోలీసులు అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

– తీళ్ల తిరుపతిరావు, శంబర గ్రామం

అప్రమత్తంగా ఉండాలి

తెలిసిన వ్యక్తుల పేరిట మళ్లీ కొత్తగా వచ్చిన ఫేస్‌బుక్ రిక్వెస్టులపై జాగరూకతతో ఉండాలి. ఆ ఖాతా నుంచి అత్యవసరం.. డబ్బులు కావాలని అవతలి వ్యక్తులు ఎవరైనా అడిగితే.. అసలు వ్యక్తులకు నేరుగా ఫోన్ చేసి నిర్ధారణ చేసుకోవాలి.

- 'మన స్నేహితులు, బంధువుల డీపీతో తెలియని నంబర్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చి, డబ్బులు అడిగితే స్పందించవద్దు. వెంటనే అసలు వ్యక్తితో నేరుగా మాట్లాడి, నిర్ధారణ చేసుకున్న తర్వాతే ఒక నిర్ణయానికి రావాలి.
- గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దు. వాటిని తెరిచేందుకు ప్రయత్నించవద్దు.
- ఫలానా బ్యాంకు అంటూ, ఇతర లావాదేవీలంటూ ఎవరైనా ఫోన్ చేసినా, సంక్షిప్త సందేశం పంపినా వెంటనే స్పందించవద్దు. వారు అడిగిన వివరాలేవీ ఇవ్వొద్దు. నేరుగా సంబంధిత కార్యాలయానికి వచ్చి వివరాలు ఇస్తామని చెప్పడం ఉత్తమం. సంక్షిప్త సందేశాలతో వచ్చే లింకులపైనా క్లిక్ చేయవద్దు.
- 'ఫోన్ సెట్టింగ్‌లో 'ఇన్‌స్టాల్ ఫ్రం అన్‌నోన్ సోర్సెస్' ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలి. దీనివల్ల అనుమతి లేని యాప్‌లు మన ఫోన్‌లో ఇన్‌స్టాల్ కావు. మీ ఫోన్‌లోని కాంటాక్టులను, సమాచారాన్ని యాక్సెస్ చేసుకునేందుకు అనుమతి ఇవ్వకూడదు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసేముందు అది ఎక్కడ నుంచి వచ్చిందో క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి.
- 'తెలియక మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే, వెంటనే ఆ ఫోన్‌ను రీసెట్ చేసుకోవాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

గంబూషియాతో మలేరియా పరారీ

- దోమల లార్వాను తినేయనున్న ఫిష్
- నీరు నిల్వ, నీరు పారే చెరువుల్లో వదలనున్న అధికారులు
- జిల్లాలో ప్రస్తుతం 398 మలేరియా కేసులు నమోదు



వసాదిలో ఫిష్‌ను వదులుతున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ప్రజలను పట్టిపీడిస్తున్న మలేరియా వ్యాధికి చెక్ పెట్టేందుకు వైద్యారోగ్యశాఖ చర్యలకు ఉపక్రమించింది. మలేరియా బారిన పడి ఏటా కొంతమంది మృత్యువాతపడేవారు. మైదాన ప్రాంతంతో పాటు గిరిజన ప్రాంతానికి చెందిన వారు కూడా మలేరియా బారిన పడేవారు. ఈ వ్యాధికి కారణమైన దోమలు వృద్ధి చెందకుండా మొగ్గలోనే తుంచేయానికి గంబూషియా ఫిష్‌ను వైద్యాధికారులు వినియోగించనున్నారు. నీరు పారే ప్రాంతాల్లోను, నీరు నిల్వ ఉన్న చోట ఈఫిష్‌ను వదులుతారు. మలేరియాను కలగజేసే అనాఫిలిస్ దోమలకు చెందిన లార్వాలను గంబూషియా ఫిష్ తినేస్తుంది. తద్వారా దోమల వృద్ధి ఆగిపోతుంది. ఫలితంగా వ్యాధి వ్యాప్తి గణనీయంగా తగ్గిపోతుంది.

జిల్లాలో 3.05 లక్షల గంబూషియా ఫిష్

జిల్లాలోని పలు గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో 3.05 లక్షల గంబూషియా ఫిష్‌ను వైద్యాధికారులు వదలనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం 40 వేల గంబూషియా ఫిష్‌ను బొద్దాం, గంట్యాడ, కొట్టాం, ఎల్.కోట, పెదమజ్జిపాలెం, వేపాడ పీహెచ్‌సీల పరిధిలో వదిలారు. జిల్లాలో ప్రస్తుతం 398 మలేరియా కేసులు నమోదై ఉన్నాయి.



పెదమజ్జి పాలెం పీహెచ్‌సీ పరిధిలోని బోనంగి గ్రామం చెరువులో గంబూషియా ఫిష్‌ను వదులుతున్న వైద్యసిబ్బంది

మలేరియా వ్యాప్తి ఇలా:

అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. మలేరియా వచ్చిన తర్వాత చికిత్స పొందేకంటే రాకుండా ముందే జాగ్రత్తలు పాటించడం మంచిది. తీవ్రమైన చలిజ్వరం, రోజు విడిచి రోజు జ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి మలేరియా వ్యాధి లక్షణాలు.

వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చేయాలి. సాయంత్రం వేళ వేపాకు పొగ వేసి దోమలను పారదోలవచ్చు. నీరు నిల్వ ఉండే గోలాలు, ఎయిర్ కూలర్లు వారానికి ఒకసారి క్లీన్ చేసి బాగా తడి ఆరిన తర్వాతే మళ్లీ నీరు వేయాలి. వీధి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. బావుల్లో, పూడ్చలేని కందకాల్లో దోమ లార్వాలను తినే గంబూషియా చేపలను వదలడం ద్వారా దోమలు పెరగకుండా చేయవచ్చు.

గంబూషియా ఫిష్ వదులుతున్నాం

మలేరియా నివారణ కోసం గంబూషియా ఫిష్‌ను వదులుతున్నాం. 40 వేల గంబూషియా ఫిష్‌ను జిల్లాలోని నీరు పారే కాలువులు, చెరువుల్లో బుధవా రం వదిలాం. మిగిలిన వాటిని కూడా వదులుతాం.

వై.మణి, జిల్లా మలేరియా నివారణ అధికారి

ప్రకృతి వ్యవసాయం విస్తరించాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరింపజేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగుకు సానుకూలంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ఎరువులు, రసాయన మందుల వినియోగం తగ్గించి, ప్రకృతి వ్యవసాయం చేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏ రకమైన ఎరువులు, రసాయన మందులు వాడుకుండా ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటల ఉపయోగాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. చిరుధాన్యాల సాగు, ఉపయోగాన్ని వివిధ రకాల ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వం స్థలాల్లో కిచెన్ గార్డెన్‌ల సాగుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతు సమస్యలను తీర్చడానికి వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ సందర్భంగా జట్టు ట్రస్టీ డి.పారినాయుడు ప్రకృతి వ్యవసాయం పుస్తకాలను, 'బడి నుంచి పొలం బడి' పాఠ్యపుస్తకాలను కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్, ఇన్‌చార్జ్ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాధాకృష్ణ, నాబార్డ్ డీడీఎం దినేష్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు, ఎన్‌జీఓ ప్రతినిధులు, ఏపీసీఎన్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు ప్రకృతి వ్యవసాయ పుస్తకాలను అందజేస్తున్న జట్టు ట్రస్టీ పారినాయుడు

ప్రతి ఒక్కరినీ పరీక్షించాల్సిందే

జిల్లాలోని ఏదైనా గ్రామంలో జ్వరం కేసు నమోదైతే ఆ గ్రామంలో ప్రతి ఒక్కరినీ పరీక్షించాల్సిందేనని వైద్యారోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగీ కేసులు ఎక్కడా నమోదు కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అనుమానాస్పద కేసులున్నా అన్ని పరీక్షలు చేసి, అవసరమైన వైద్యం అందించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శివ కుమార్, ప్రోగ్రామ్ అధికారులు ఎం.వినోద్, టి.జగన్ మోహన్‌రావు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



సురేష్ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలసకు చెందిన యువకుడు నడగాన సురేష్ (24) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్ కుటుంబ సభ్యులు వ్యక్తిగత పనుల మీద పార్వతీపురం వెళ్లారు. వారు మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటిలోపల వైపున తలుపులు గడియవేసి ఉన్నాయి. ఇంటి వెనుక తలుపు రంధ్రంలో నుంచి చూడగా లోపల ఇనుప చువ్వకు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ సురేష్ కనిపించాడు. తల్లిదండ్రులు బోరున విలపిస్తూ పొరుగువారి సహాయంతో తలుపులు పగులగొట్టారు. అప్పటికే కుమారుడు మృతి చెందడంతో తండ్రి వెంకటరమణ రామభద్రపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు.

కర్లాం వీఏఏపై సస్పెన్షన్ వేటు

విజయనగరం ఫోర్ట్: చీపురుపల్లి మండలంలోని కర్లాం గ్రామ వ్యవసాయ సహాయకుడు(వీఏఏ) రాఘవపై సస్పెన్షన్ విధించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు బుధవారం తెలిపారు. జూలై ఒకటో తేదీన పింఛన్ డబ్బులకు సంబంధించి రూ.3.90 లక్షలు లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా పరారవడం, అలాగే విత్తనాల విక్రయానికి సంబంధించి రూ.1.50 లక్షలు కట్టకపోవడం కారణంగా సస్పెన్షన్ విధించినట్లు చెప్పారు.

రేషన్‌లో ఉచితంగా రాగులు

పార్వతీపురంటౌన్: రేషన్ సరుకుల్లో ఇకపై రాగులను ఉచితంగా అందించాలని కార్డుదారుల అవసరాలకు తగ్గట్టుగా సన్నద్ధం చేస్తున్నట్లు పౌర సరఫరాల అధికారి శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 2,81,251 మంది కార్డుదారులున్నారని, వారికి ప్రతి నెలా 5215.165 టన్నుల బియ్యం అందిస్తున్నారని తెలిపారు. బియ్యం కిలో రూపాయికి ఇవ్వాల్సి ఉన్నా..ఆహార భద్రత చట్టం అమల్లో భాగంగా ఉచితంగా పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఈ నెలలో బియ్యం స్థానంలో రాగులు అందించేలా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కిలో బియ్యం బదులు కిలో రాగులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈసారి ఉచితంగా అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో రాగులు ఇవ్వాలంటే 280 టన్నుల పంట అవసరం అవుతుందని అభిప్రాయ పడ్డారు.

కామ్రేడ్ అర్జునరావు ఆశయ సాధనకు కృషి



గొటివాడలో అర్జునరావు స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

కురుపాం: శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని గిరిజనుల హక్కుల కోసం పోరాడిన కామ్రేడ్ అర్జునరావు ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, లింగరాజులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండంగి అర్జునరావు 3వ వర్ధంతి సందర్భంగా కురుపాం మండలంలోని గొటివాడ గ్రామంలో ఆయన స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్జునరావు శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని ఆరేళ్ల పాటు విశాఖ సెంట్రల్ జైల్లో జీవితం అనుభవించారని గుర్తు చేశారు. జైలు నుంచి విడుదలై వచ్చిన తరువాత మాతృసంస్థ అయిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సభ్యత్వం పొంది గిరిజన, దళిత, ఇతర బడు గు బలహీన వర్గాలకు అండగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంపటాపు భారతి, కూరంగి గోపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గురుకులం టెండర్లు వాయిదా

సీతంపేట: గిరిజన గురుకుల విద్యాలయాలకు సరఫరా చేయాల్సిన కూరగాయలు, చికెన్, పండ్ల కోసం నిర్వహించే టెండర్ ప్రక్రియను వాయిదా వేసినట్టు ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి టెండర్లు నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులంతా ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు 9, 10 తరగతుల విద్యార్థులు, పోస్టు మెట్రిక్ వేతనాలకు ఇంటర్మీడియట్ నుంచి పీజీ ఇతర ఉన్నత చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రీ మెట్రిక్‌కు ఆగస్టు 31, పోస్టు మెట్రిక్‌కు అక్టోబర్ 31 వరకు గడువు ఉందన్నారు.

వేటకు వెళ్తేనే.. పూట గడిచేది..!

- మత్స్యకారుల ఆందోళన
- వేట నిషేధ భృతిపై సర్కారు జాప్యం
- లబ్ధిదారుల ఎంపికపై రీసర్వే చేస్తామంటున్న మంత్రి
- కొత్త జాబితాలో పేర్లు ఉంటాయో? లేదోనని గంగపుత్రుల ఆందోళన



తిప్పలవలస తీరంలో సముద్రం ఒడ్డున నిలిపిన పడవలు

పూసపాటిరేగ: సముద్రాన్నే సర్వస్వంగా భావించి ప్రతిరోజూ సూరీడు రాక ముందే వలను భుజాన వేసుకుని ప్రాణాలకు తెగించి వేట చేస్తేనే గంగపుత్రులు జీవనం గడిచేది. అలాంటి మత్స్యకారుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 తేదీ వరకు చేపల వేటపై నిషేధం విధించడంతో మత్స్యకారులంతా ఇంటికే పరిమితి కావాల్సి వచ్చింది. ఆ తరువాత అల్పపీడనాల వల్ల వచ్చిన భారీ వర్షాల కారణంగా వేటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. మరో వైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతున్నా మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఎప్పుడు ఇస్తారో తేల్చి చెప్పడం లేదు. తాజాగా మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక అడుగు ముందుకేసి మత్స్యకార భరోసా లబ్ధిదారుల జాబితాపై రీసర్వే చేస్తామని ప్రకటించడంతో జాబితాలో తమ పేర్లు ఉంచుతారో పీకేస్తారోనని గంగపుత్రులు ఆందోళన చెందుతున్నారు.

61 రోజులు వేట నిషేధం

కేంద్రప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం చేపలు, రొయ్యలు, పీతలు వంటి జలచరాలు గుడ్లుపెట్టే పునరుత్పత్తి సమయంలో మత్స్యసంపద వృద్ధి కోసం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వ తేదీ వరకు 61 రోజుల పాటు సముద్ర జలాల్లో చేపల వేట నిషేధం అమలవుతుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం చేపల వేట నిషేధ సమయానికి గాను మత్స్యకారులకు కేవలం రూ.4 వేలు ఇచ్చేది. అది కూడా తక్కువ మందికి ఇచ్చేవారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచి మత్స్యకారుల అకౌంట్లలో జమచేశారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ.20 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు రూ.20 వేల మాట దేవుడెరుగు..అసలు వేట నిషేధ భృతి ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

గత ఏడాది సక్రమంగా అందిన భృతి

2023లో చేపల వేట నిషేధ సమయంలోనే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసా అందజేశారు. ఈ ఏడాది పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 885 బోట్లలో వేటకు వెళ్తున్న 3,798 మంది మత్స్యకారులను సర్వేచేసి మత్స్యకార భరోసాకు అధికారులు ఎంపిక చేశారు. ఆయా జాబితాలను మత్స్యశాఖ ఉన్నతాధికారులకు పంపించారు. 15 రోజుల క్రితం గతంలో ఎంపిక చేసిన జాబితా కాకుండా మళ్లీ రీసర్వే చేస్తామని మత్స్యశాఖ మంత్రి ప్రకటించడంతో చిక్కుముడి పడినట్లయింది. ఇప్పటికే వేటనిషేధం ముగిసి రెండు నెలలవుతున్నా పరిహారం ప్రకటించకపోవడంతో మత్స్యకారులు మండి పడుతున్నారు. రీసర్వే చేసేదెప్పుడు? పరిహారం ఇచ్చేదెప్పుడు? అని ప్రశ్నిస్తున్నారు. కొత్తగా రీసర్వే పేరుతో లబ్ధిదారులను తగ్గించేందుకే కుట్రపన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేట నిషేధ సమయంలో అప్పులు

వేట నిషేధ సమయంలో అప్పులు చేసి కాలం వెళ్లదీశాం. 61 రోజుల పాటు జీవనోపాధి కోల్పోవడంతో చాలా ఇబ్బంది పడ్డాం. వేట నిషేధ సమయం పూర్తయి రెండు నెలలవుతున్నా మత్స్యకారులకు భృతి అకౌంట్లలో వేయలేదు.

– బి. కొర్లయ్య, మత్స్యకారుడు చింతపల్లి

నిషేధసమయంలోనే మత్స్యకార భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేట నిషేధ సమయంలోనే మత్స్యకారులు అందరికీ రూ.10 వేలు చొప్పున బ్యాంక్ అకౌంట్లలో జమచేశారు. సుమారు రెండు నెలల జీవనభృతి కోల్పోయిన మాకు వేట నిషేధ భృతి ఎప్పుడు వేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

– వాసుపల్లి కన్నయ్యతాత, తిప్పలవలస